


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 107 శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

● చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి ● జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం ● నిబంధనల పై హెచ్ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన ● విదేశీయుల పైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు



## వారణాసిలో చంద్రబాబు ప్రసంగానికి జేజేలు..

## “వెరీ వెల్” అంటూ రాజ్‌నాథ్ ప్రశంస

వార్త సాక్ష్యం :
ప్రధానిగా మోదీ 25ఏళ్ల ప్రస్థానం సందర్భంగా వారణాసిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం “ప్రధాని నరేంద్ర మోదీ సరైన సమయంలో సరైన నాయకుడు (రైట్ టైమ్.. రైట్ లీడర్). ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, కేవలం దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి మనమందరం అండగా నిలవాలి.- మిగతా2లో



# వారణాసిలో సీఎం చంద్రబాబు..

## కాశీ విశ్వనాథునికి కేంద్ర మంత్రులతో కలిసి ప్రత్యేక పూజలు

● వారణాసిలో కాశీ విశ్వనాథుని దర్శించుకున్న సీఎం చంద్రబాబు ● ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం పై జరిగిన సేవాయాత్రలో పాల్గొన్న బాబు ● కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగితో కలిసి పూజలు ● స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం చేసి, భక్తులకు ప్రసాదం పంపిణీ



## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని



● ఆళ్ల నాని కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తి గతంగా అండగా ఉంటాం ● ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్

వార్త సాక్ష్యం :
ఆంధ్రప్రదేశ్ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్, ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. - మిగతా2లో

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు



వార్త సాక్ష్యం :
ఏపీలో డీఎస్సీ నియామకాల పై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వం పై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. - మిగతా2లో

## రాష్ట్రంలో తీవ్ర కరవు పై ముందస్తు చర్యలు శూన్యం



- రాష్ట్రంలో కరవు పరిస్థితుల పై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

వార్త సాక్ష్యం :
ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితుల పై సమీక్ష జరిపారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనుల పై మైనింగ్ శాఖ దాడి..



వార్త సాక్ష్యం :
అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు పరిధిలో అక్రమ మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన గనుల్లో లీజు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదుల పై మైనింగ్ శాఖ అధికారులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు. - మిగతా2లో

వార్త
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

# వారణాసిలో సీఎం చంద్రబాబు.. కాశీ విశ్వనాథునికి కేంద్ర మంత్రులతో కలిసి ప్రత్యేక పూజలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కాశీ విశ్వనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వారణాసిలో "వాద్‌నగర్ సేవాయాత్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు వారణాసి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న చంద్రబాబుకు పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, ఇతర ప్రముఖులు గర్భగుడిలో కాశీ విశ్వనాథునికి పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పూజల ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు, యూపీ సీఎం యోగి కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్ కుమార్ కూడా ఉన్నారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని

మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్, ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఆళ్ల నాని మృతి బాధాకరం. ఆంధ్ర రాష్ట్రం ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది. నాని అన్న మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. సభలో అనేక అంశాలపై ఆయనతో చర్చించేవాడిని. అయితే ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లకుండా హుందాతనంగా ఆయన వ్యవహరించేవారు" అని లోకేష్ తెలిపారు. "రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆళ్ల నాని అన్న. వ్యక్తిగత దూషణలకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు, ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల గురించి మాట్లాడేందుకే ఉపయోగించాలనే భావనతో ఆయన ఉండేవారు" అని చెప్పారు. "ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా ఆళ్ల నాని సమాజానికి చేసిన సేవలు చరస్మరణీయం. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి ప్రజలకు సేవ చేయాలని, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనిఎ అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి నాని అన్న" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సమయంలో తాను ఆయనతో చెప్పిన విషయాలను మంత్రి గుర్తుచేశారు. "ఐదు సంవత్సరాలుగా మిమ్మల్ని దగ్గరుండి చూసిన వ్యక్తిని. మీరు ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటే వ్యక్తి కాదు. క్రమశిక్షణ అనే పాఠశాల మీది. మీలాంటి వ్యక్తులు రాజకీయాల్లో నడుచుకునే తీరును చూసి మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలని చెప్పాను" అని లోకేష్ తెలిపారు. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు తమ మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ప్రభుత్వ లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు జరుగుతున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి అక్కడే ఉండి అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డా.నిమ్మల రామానాయుడు, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, ఏపి ఉపసభాపతి, ఉండి నియోజవర్గ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా ఇంచార్జి కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణాలు కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జీ, మాజీ ఏలూరు నగరపాలక సంస్థ మేయరు షేక్ నూర్జహాన్, వివిధ శాఖలు అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రజలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తీవ్ర కరవు పై ముందస్తు చర్యలు శూన్యం

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

# వారణాసిలో చంద్రబాబు ప్రసంగానికి జేజేలు.. "వెరీ వెల్" అంటూ రాజ్‌నాథ్ ప్రశంస

రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, కేవలం దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి మనమందరం అండగా నిలవాలి. ఎన్డీయే ఐక్యతే ఈ దేశానికి బలం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'వారణాసి-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులను సమగ్రంగా వివరించారు.

### VKS మంత్రంతో అభివృద్ధి

కాశీ క్షేత్రం ప్రధాని మోదీకి కర్మభూమి అని, ఇక్కడి ప్రజలు కేవలం తమ ఎంపీని మాత్రమే కాక, దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించారని చంద్రబాబు అన్నారు. "VKS (వాద్‌నగర్, కాశీ, సెప్టెంబర్) అనేది నేటి భారత అభివృద్ధి మంత్రం. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలతో 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కలిగింది. పీఎం కిసాన్ పథకం ద్వారా 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు అందుతోంది," అని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఉత్పత్తి చేయించి, 140 కోట్ల మంది ప్రజలను కాపాడటమే కాకుండా, 101 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మోదీ మానవత్వాన్ని చాటారని కొనియాడారు.

### టెక్నాలజీ నుంచి జాతీయ భద్రత వరకు

ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి విధానాలతో ఒకప్పుడు రక్షణ పరికరాలు దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరిందని చంద్రబాబు తెలిపారు. "టెక్నాలజీని పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండక్టర్ టెక్నాలజీలతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నారు. ఆయన దూరదృష్టితో దేశంలో 2.20 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారు," అని అన్నారు. మహిళా సాధికారతకు 'భేటీ బచావో-భేటీ పడావో', 'లఖ్‌పతీ దీదీ' వంటి పథకాలతో పాటు, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి అధినియమ్' ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందని అభిప్రాయపడ్డారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, "ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు అంతమొందించారు. దానికి నేనూ ఒక బాధితుడినే. నక్సలైట్లు నన్ను టార్గెట్ చేశారు. కానీ మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉంది" అని చంద్రబాబు గుర్తుచేశారు.

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీ పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనుల పై మైనింగ్ శాఖ దాడి..

వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన గనుల్లో లీజు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులపై మైనింగ్ శాఖ అధికారులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు. సాంకేతిక బృందాలతో కలిసి రంగంలోకి దిగిన అధికారులు మైనింగ్ సరిహద్దులు, పరిమితికి మించిన క్వారీయింగ్ ఆరోపణలపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధునాతన మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా నిబంధనలను ఉల్లంఘించి ఎంత మొత్తం ఖనిజాన్ని అక్రమంగా తరలించారో తేల్చేందుకు సర్వే నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా.. మైనింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న హెవీ యంత్రాలు, పొక్లెన్లు, రవాణా వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలపై మైనింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నేమకల్లు గనుల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. మైనింగ్ చట్టాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై విచారణ కొనసాగుతోందని, ఉల్లంఘనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు

ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్ గర్ ముస్లింల విదేశీ ప్రయాణం పై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది.

## ప్రధాని మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సోషల్ మీడియా వేదికగా వారు తమ సందేశాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానిగా మీ నాయకత్వం చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా సుమారు 25 ఏళ్ల మీ ఆదర్శప్రాయమైన ప్రజాసేవ భారత ప్రగతి ప్రస్థానానికి నూతనోత్తేజాన్ని అందించింది. 'సేవ, సంకల్ప్, సుశాసన్' అనే మీ దార్శనికత 140 కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశసేవలో ప్రధాని మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని, ఆయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. నారా లోకేశ్ సైతం ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ.."సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న మీ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. మీలోని అపారమైన శక్తి, క్రమశిక్షణ, దేశాభివృద్ధి పట్ల మీకున్న అచంచలమైన నిబద్ధత ప్రజాక్షేత్రంలో ఉన్న మా వంటి లక్షలాది మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని కొనియాడారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## మౌనంగానే ఉండమని అంటోంది మన రాజ్యాంగం!



2026లో పార్లమెంట్ ఆమోదించిన సవరణ చట్టం 1971 నాటి 'జాతీయ గౌరవాలకు అవమాన నిరోధక చట్టం'లోని సెక్షన్ 3ను మార్చింది. ఇంతవరకు ఈ సెక్షన్ జాతీయగీతం (జనగణమన) ఆలాపనకు అడ్డుపడటాన్ని మాత్రమే నేరంగా చూసేది. ఇప్పుడు అదే రక్షణను జాతీయ గేయం (వందేమాతరం)కు కూడా వర్తింపజేస్తున్నది. ఈ చట్టం ప్రకారం 'వందేమాతరం' పాడుతున్నప్పుడు అడ్డుపడినా, అవమానించినా దానిని నేరంగా పరిగణిస్తారు. అయితే గేయాన్ని పాడకుండా ఎవరైనా మౌనంగా ఉంటే, అది కూడా నేరమేనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే ముందు మరో ప్రాథమిక ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. మౌనం అంటే ఏమీ చెప్పకపోవడమేనా, లేక అది కూడా ఒక రకమైన వ్యక్తీకరణేనా? మన రాజ్యాంగం దీనికి స్పష్టమైన సమాధానమే ఇస్తున్నది.రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రతి పౌరుడికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇస్తున్నది. సాధారణంగా మనం దీన్ని 'మాట్లాడే హక్కు'గా అర్థం చేసుకుంటాం. కానీ కోర్టులు దీన్ని మరింత లోతుగా చూస్తున్నాయి. ఒక విషయాన్ని చెప్పే హక్కు ఎంత ముఖ్యమో, చెప్పకుండా ఉండే హక్కు కూడా అంతే ముఖ్యమని నొక్కి చెబుతున్నాయి. ఎవరైనా ఒక విషయాన్ని అంగీకరించినా, అంగీకరించకపోయినా, మౌనం ద్వారానే తన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. ఆ హక్కును కూడా రాజ్యాంగం కాపాడుతుంది. భారత అత్యున్నత న్యాయస్థానం దీన్ని పలు సందర్భాలలో నిరూపిం చింది. 1986లో బిజోయ్ ఇమాన్యుయేల్ వర్సెస్ కేరళ రాష్ట్రం అనే కేసు మంచి ఉదాహరణ. కేరళలో క్రైస్తవ మత విశ్వాసం కలిగిన ఇద్దరు పిల్లలు జాతీయగీతం పాడేటప్పుడు గౌరవంగా నిలబడేవారు. అయితే జాతీయగీతాన్ని ఆలపించడం లేదని పాఠశాల వారిని బహిష్కరించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు గౌరవంగా నిలబడటమే సరిపోతుంది, పాడాలని బలవంతం చేయలేమని, పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పుకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో పాటు, మతస్వేచ్ఛనిచ్చే 25వ అధికరణ కూడా మద్దతునిచ్చింది. 1978లో నందిని సత్పతి వర్సెస్ పి.ఎల్.దానీ కేసులో, పోలీసుల విచారణలో కూడా మౌనంగా ఉండే హక్కును కోర్టు సమర్థించింది. వేర్వేరు సందర్భాలే అయినా, వీటన్నింటి వెనుక ఉన్న సూత్రం ఒక్కటే. మాట్లాడాలా వద్దా అనేది వ్యక్తి నిర్ణయం. శాసన అధికారం ద్వారా ఒక వ్యక్తి తనకు ఇష్టం లేని విషయాన్ని మాట్లాడాలని బలవంతం చేయడం కుదరదు. ఇదే సూత్రాన్ని ఇతర దేశాలు కూడా అనుసరించాయి. అమెరికాలో 1943లోనే వెస్ట్ వర్జీనియా వర్సెస్ బార్నెట్ కేసులో విద్యార్థులను జెండాకు వందనం చేయాలని బలవంతం చేయలేమని కోర్టు తీర్పు ఇచ్చింది. దేశమేదైనా పౌరుడి నోటిలో బలవంతంగా మాటలు కుక్కడం ప్రజాస్వామ్య విరుద్ధమే. మరి జాతీయగీతాన్ని గౌరవించాలని కూడా రాజ్యాంగమే చెబుతున్నది కదా? అవును, చెప్పింది. 51ఎ అధికరణ ప్రకారం, జాతీయగీతానికి గౌరవం చూపడం ప్రతి పౌరుడి బాధ్యత. కానీ ఇక్కడ ఒక సూక్ష్మమైన తేడా ఉంది. గేయాన్ని పాడడం మాత్రమే గౌరవం కాదు. గేయంపై గౌరవంతో నిలబడటం, భంగపరచకుండా ఉండటం కూడా గౌరవించడమే. ఉదాహరణకు రాజకీయ సభలు జరుగుతున్న సందర్భంలో మసీదులో కల్మాను చదువుతున్నప్పుడు నాయకులు తమ ప్రసంగాన్ని ఆపి, తర్వాత కొనసాగిస్తారు. నిస్సందేహంగా ఇది గౌరవాన్ని ప్రకటించడమే. వారు కూడా కల్మాను చదివితేనే గౌరవం ప్రకటించినట్లు కాదు కదా? మౌనంగా నిలబడడం కూడా ఒక విధమైన గౌరవ వ్యక్తీకరణలో భాగమే. బాధ్యత, హక్కు ఈ రెండూ కలిసే ఉంటాయి. ఇప్పుడు 2026లో వచ్చిన కొత్త చట్టాన్ని ఇదే కోణం నుంచి చూద్దాం. ఈ చట్టం వందేమాతరం ఆలాపనకు అడ్డుపడటాన్ని, పాడుతున్నవారిని భంగపరచటాన్ని నేరంగా పరిగణిస్తుంది. ఈ నేరానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంది. అంతేగానీ గేయాన్ని పాడుతున్నప్పుడు మౌనంగా నిలబడి గౌరవాన్ని ప్రకటిస్తున్నవారు నేరస్థులు అని ఈ చట్టం చెప్పడం లేదు. పైన చెప్పిన రాజ్యాంగ సూత్రం ప్రకారం చూస్తే, ఈ మౌనం రాజ్యాంగం కాపాడే వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే.అయితే, ఇది రాతలో ఎంత స్పష్టంగా ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులభంగా కొనసాగదు. మూడేళ్ల జైలు శిక్ష అనే మాట వినగానే పాఠశాలలు, సంస్థలు భయపడతాయి. రిస్క్ వద్దని అందరినీ పాడమని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. ఇదే అసలు సమస్య. చట్టం సరిగ్గానే ఉన్నప్పటికీ, దాన్ని అమలు చేసే చేతుల్లో రాజ్యాంగ సూత్రంపై అవగాహన లేకపోతే, హక్కు ఆచరణలో కనుమరుగవుతుంది. కాబట్టి వందేమాతరం వివాదంలో అసలు ప్రశ్న గేయం ఎన్ని చరణాలు పాడాలి అన్నది కాదు. మౌనాన్ని కూడా ఒక చెల్లుబాటు అయ్యే వ్యక్తీకరణగా గుర్తించగలమా? అన్నదే అసలు ప్రశ్న. ఈ గుర్తింపు ఉంటేనే గేయానికి గౌరవం, పౌరుని వ్యక్తిగత స్వేచ్ఛ రెండూ కలిసి నిలబడతాయి. ఒకటి లేకపోతే మరొకటి అసంపూర్ణమే. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. ఈ విధంగా మౌనంగా ఉండే హక్కు వందేమాతరం విషయంలో సరిగ్గా ఇలాగే వర్తిస్తుందని ఇంతవరకు ఏ కోర్టూ నేరుగా తేల్చలేదు. ఇది గతంలో జాతీయగీతంపై వచ్చిన తీర్పుల ఆధారంగా చేసిన హేతుబద్ధమైన అంచనా మాత్రమే.

# సామాన్యుల సింహ దాహాలు

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) విభాగం ఇటీవల ఇస్కాన్ (కృష్ణ చైతన్య ఉద్యమ సంస్థ) నిర్వహించే ఈటరీ (మెస్‌లు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు మొదలైనవి)లపై దృష్టి పెట్టింది. ఇస్కాన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. అదొక అంత ర్జాతీయ మత, ఆధ్యాత్మిక ఉద్యమం. లక్షలాది అను యాయులు ఉన్న ఉద్యమమది. అయితే ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే లక్ష్యం స్పష్టంగా ఉన్నది: ఆహార కల్తీని నిరోధించడం. ఆయన దృష్టిలో ఎవరూ చట్టం కంటే ఉన్నతులు కాదు. ఇస్కాన్ సైతం అందుకు మినహాయింపు కాదు. అందుకే ఆ సంస్థ నిర్వహించే ఈటరీలపై దాడులు. ఎఫ్‌డీఏ కమిష నర్‌గా తుకారామ్ ముండే బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లో వెలుగులోకి వచ్చిన ఆహార కల్తీ ఉదంతాలు, అంతకు ముందు 18 నెలల్లో బహిర్గతమైన అటువంటి మొత్తం ఉదంతాల కంటే చాలా చాలా అధికంగా ఉన్నాయి.మరి ప్రజలు ముండేను ఒక సింహంలా భావిస్తుండడంలో ఆశ్చర్యమేముంది? ఒక సూపర్--కాప్ కథ ఆధారంగా రూపొందిన బాలీవుడ్ సినిమా 'సింఘమ్' ప్రేరణతో ముండేను ఒక నిజ జీవిత సింహం అని ప్రజలు పిలుస్తున్నారు. వినియో గదారుల ఆరోగ్యానికి హాని చేసే కల్తీ ఆహారపదార్థాల విక్రయాన్ని అరికట్టేందుకు ఆయన చేపట్టిన చర్యల పట్ల ప్రజల ప్రతిస్పందనలో ఒక నిజం వెల్లడయింది. నిబంధనలు సరిగా పాటించని వ్యాపార సంస్థలు లైసెన్స్‌లు కోల్పోతామేమోనని భయపడుతున్నాయి. చట్టం తమకు సహాయకారిగా ఉన్నదనే ఆశాభావం ప్రజల్లో నిండుగా ఉదయిం చింది. ప్రభుత్వం ఎప్పుడో అడగవలసిన ప్రశ్నను ఒక అధికారి ఎట్టకేలకు అడుగుతున్నాడని వారు భావిస్తున్నారు: అసలు మీరు మాకు ఎటువంటి ఆహారాన్ని అందిస్తున్నారు? అనుని త్యం ఫలహారాలు, భోజనాలు ఇంటిలో కాక బయట హోటళ్లలో చేసేందుకు మనం అలవాటు పడిపోయిన రోజులివి. మిఠాయిలు, మాంసాహార వంటకాలకు ఆన్‌లైన్ ఆర్డర్లు ఇవ్వడానికి మనం బాగా అలవాటు పడిపోయాం. అవి భద్రమైనవని మనం విశ్వసి స్తున్నాం, నిరభ్యంతరకరంగా భుజిస్తున్నాం. అయితే ముండే నేతృత్వంలో ఎఫ్‌డీఏ సిబ్బంది నిర్వహిస్తున్న దాడుల్లో ఆహార భద్రతా నిబంధనలు ఎంతగా ఉల్లంఘనకు గురవుతున్నాయో దిగ్భ్రాంతికరంగా తేటతెల్లమవుతోంది. చట్టాలు లేకపోవడం వల్లనా ఈ పరిస్థితి? కాదు. చట్టాలు ఉన్నాయి. వాటిని అమలుప రచకపోవడమే అసలు సమస్య. మరి చట్టాలను అమలు పరుస్తున్న తుకారామ్ ముండే ప్రజలకు ప్రేమాస్పదుడు కావడంలో ఆశ్చర్యమేముంది?

ఆయన ఒక అసాధారణ వ్యక్తిగా కనిపిస్తున్నారు. నిబంధనలను సాధారణంగా వక్రీకరించే లేదా పూర్తిగా ఎంపిక చేసిన వాటిని మాత్రమే అమలు పరిచే, అసలు పూర్తిగా ఉపేక్షించే వ్యవస్థలో నిర్భయంగా చట్టాలను ఉపయోగించి సత్పరిపాలనను అందిస్తున్న అధికారి ఒక విప్లవశీలిగా కన్పించడం కద్దు. ముండే విషయంలో జరిగింది ఇదే. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్న అధికారిని ఒక సూపర్ హీరోగా ఎందుకు భావిస్తున్నారు? ముండేకు అత్యున్నతస్థాయి అధికారాలు లేవు. అయినా తన పరిమిత అధికారాల వినియోగంతోనే సింహంగా పేరు పొందారు. పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్నవారు వ్యవస్థలోని లోపాలను వాడుకుని తప్పించుకోవడాన్ని నిత్యం చూస్తున్న ప్రజలకు చట్టోల్లంఘనలను ఉపేక్షించని అధికారి ఒక హీరోలా కనిపించడం అసహజమేమీ కాదు. ప్రజా శ్రేయస్సుకై స్వార్థపర శక్తులను ఎదుర్కోవడం ముండేకు ఇదే కొత్త కాదు. తన ఉద్యోగ జీవితం ఆరంభం నుంచీ ఆయన ఈ ధర్మ మార్గంలోనే నడుస్తున్నారు. ఎప్పుడూ ఎక్కడా రాజీపడకపోవడం వల్లే 21 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో 25సార్లు బదిలీ అయ్యారు! ఒక అధికారి తన బాధ్యతల నిర్వహణలో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ఉద్యోగ సోపానాలను అధిరోహిం చగలడు. అయితే ఉద్యోగ విధులు నిర్వర్తిం చడంలో అనివార్యంగా తీసుకోవల్సిన ప్రతి నిర్ణయం విషయంలోనూ దాని పర్యవసానాలు ఎలా ఉంటాయోనని ముందుగా బాగా ఆలోచిం చవలసిన అగత్యమున్న వ్యవస్థలో నిజాయితీ పరుడైన అధికారి మనుగడ సాగించగలగడం చాలా కష్టం. తాను తీసుకోబోయే నిర్ణయంతో ఎవరు ఆశాభంగం చెందుతారు? ఒక రాజకీయవేత్త ఆక్షేపణ తెలుపు తాడా? ధనబలం దండిగా ఉన్న వ్యాపారవేత్త ఎవరైనా అసంతృప్తితో ఫోన్ చేస్తాడా? ఏదైనా ఒక మత వర్గం వారు నిరసనకు దిగుతారా? పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నత స్థాయిలో తమకు ఉన్న సంబం ధాలను ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉపయోగించుకుంటారా? అసలు నిర్ణయాన్ని పూర్తిగా అమలుపరచకముందే బదిలీ ఉత్తర్వు వస్తుందేమో?!

ఇటువంటి ప్రశ్నలు, సందేహాలతో సతమతమవ్వక తప్పని పరిస్థితులలో ఏ అధికారి అయినా దీక్షాదక్ష తలతో ఎలా వ్యవహ రించగలడు? ప్రభుత్వ వ్యవస్థలు తమ స్వతంత్రతను క్రమంగా కోల్పోతున్నాయి. ఎందుకని? ప్రతి ప్రభుత్వాధికారీ అవినీతిపరుడు అయినందువల్లకాదు. అలా భావించడం ఒక మూస పద్ధతిలో ఆలోచిం చడమే అవుతుంది. స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షిస్తూ, చెప్పినట్లు చేసేవారిని అందలాలు ఎక్కిస్తున్న ఒక వ్యవస్థ సంబంధిత వ్యక్తులందరికీ ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతున్నది. 'స్వతంత్రంగా వ్యవహరించి అపాయాన్ని కొనితెచ్చుకోవద్దు' అని ఒక తీవ్ర హెచ్చరిక చేస్తున్నది. ప్రభుత్వ వ్యవస్థలో తరచూ అతి సులువుగా చేయగలిగే పని... అసలు ఏమీ చేయకపోవడమే. కష్టమైన పని ఏమిటంటే... చేయవ లసిన పని చేయడమే! చేయవలసిన పని చేస్తున్నాడు కాబట్టే తుకారామ్ ముండేను ప్రజలు మౌనంగా మెచ్చుకుంటున్నారు. ఆయనకు మద్దతుగా ఒక పెద్ద రాజకీయ ఉద్యమా నికి వారు ఉపక్రమించలేదు. ఇది గమనార్హం. తుకారామ్‌కు మరొక ఉన్నత బాధ్యతను అప్పగించాలని ఎవరూ డిమాండ్ చేయడం లేదు. అయితే ముండే నిర్వహిస్తున్న ప్రతి తనిఖీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రచారం లోకి వచ్చినప్పుడు, పేరు ప్రతిష్ఠలు ఉన్న ఒక సంస్థను ఆయన ప్రశ్నించినప్పుడు ప్రజలు ప్రతిస్పంది స్తున్నారు. వారిలో నిబిడీకృతంగా ఉన్న ధర్మాగ్రహం పురిగొల్పిన ప్రతిస్పందన అది, సందేహం లేదు. అవును, ఎట్టకేలకు ఎవరో ఒకరు ఏదో ఒకటి చేస్తు న్నారు. భారతీయులు నియమ నిబంధనలను స్వత హాగా ఇష్టపడరని కాదు. వాటి అమలులో పక్షపాతాన్ని వారు కచ్చితంగా ఇష్టపడరు. ఈ సంస్థ ఎవరిది? ఎవరికి ఎవరు తెలుసు? ఆ సంస్థకు ఎంత పలుకుబడి ఉంది? దానిపై చర్య తీసుకుంటే ఏ రాజకీయపక్షం లేదా మత సమూహం అది తమకు వ్యతిరేకంగా తీసుకున్నదేనని నొచ్చుకుం టుంది? అన్న ప్రశ్నలే తలెత్తకూడదు. చట్టం అర్థవంతంగా ఉండాలంటే దానిని నిష్పాక్షికంగా అమలుపరచాలి. అందరికీ సమానంగా వర్తిం పజేయాలి. ఇదే తుకారామ్ ముండే సంచల నశీలత నిజమైన పాఠం. ఆయన తన బాధ్యతల నిర్వహణలో ఒక సింహంలా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావిస్తు న్నారు. 'నిజ జీవిత సింహం' అని ఆయనను పిలుస్తున్నారు. అయితే ఈ ప్రశంసే ఆయన కథలో ఆశ్చర్యకరమైన విషయం కాదు. అసలు ఆశ్చర్య కరమైన విషయమేమిటంటే-- అలాంటి వ్యక్తులే అన్ని అధికార స్థానాలలో ఉండాలని ప్రజలు ఎంతగానో పరితపిస్తుండడమే. ఆహార భద్రత అనేది తుకారామ్ ముండే ఎఫ్‌డీఏ ప్రధానాధికారిగా ఉండడంపై ఆధారపడి ఉండకూడదు. రెస్టారెంట్లు శుచి, శుభ్రత ఉన్న ఆహారాన్ని అందించడమనేది ఒక నిర్దిష్ట అధికారి దాడులు, తనిఖీలు చేస్తున్నాడనే విషయంపై ఆధారపడి ఉండకూడదు. కఠిన వైఖరితో వ్యవహరించే అధికారి ఉన్నప్పుడు మాత్రమే ఆహార కల్తీదారులు భయపడడం జరగకూడదు. ఆ అధికారి బదిలీ అయిన తరువాత కూడా వ్యవస్థ సక్రమంగా పనిచేయాలి. ఇదే ఒక హీరోకు, ఒక వ్యవస్థకు మధ్య వ్యత్యాసం. హీరో ఒక నిర్దిష్ట సమయం లేదా సందర్భంలో మాత్రమే పరిస్థితులను మార్చగలడు. వ్యవస్థ అనేది నిరంతరం నడుస్తుంది. సదా ప్రజాహి తంగా నడుస్తుండాలి. అటువంటి వ్యవస్థ ప్రజల దైనిక జీవితాన్ని మెరుగ్గా మార్చివేయగలదు. మన వ్యవస్థలు లేదా సంస్థలు సదా సక్రమంగా పనిచేస్తూ ప్రజల విశ్వసనీయతను పొందగలిగే దాకా ముండే లాంటి వ్యక్తులు అమితంగా ప్రాధాన్యం పొందడమనేది కొనసాగుతూనే ఉంటుంది. తుకారామ్ ముండే తానేదో మానవాతీత కార్యాన్ని నిర్వహిస్తున్నట్టు ఏ కోశానా భావించరు. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తున్నట్టు మాత్రమే చెబుతారు. మరి ప్రతి ప్రభుత్వోద్యోగి కూడా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, పక్షపాతానికి తావివ్వకుండా, తన పై అధికారులకు భయపడకుండా తన విధులను తాను నిర్వహిస్తే మన ప్రభుత్వ వ్యవస్థల్లోను, సమాజంలోను పరిస్థితులు ఎలా ఉంటాయో ఆలోచించండి. మన దేశంలో చట్టాలు, విధానాలు, పథకాలు, కమిటీలకు కొరత లేదు. అయితే వాటిని సరిగ్గా అమలుప రచకపోవడమే దేశం అనునిత్యం ఎదుర్కొంటున్న ఒక పెద్ద సమస్య. ప్రభుత్వ సిబ్బంది తమ విధులను నిజాయితీగా స్వచ్ఛం దంగా స్వతంత్రంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందో కదా. భారతదేశ పాలనా సంక్షోభం గణనీయంగా తగ్గుతుంది, సందేహం లేదు. ఇదే జరిగితే తుకారామ్ ముండే లాంటి నిజ జీవిత సింహాలను అన్వేషించవలసిన అవసరం మనకు ఉండదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమ విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తే అసాధారణ వ్యవహా రశైలికి ఆస్కారముండదు. అంతా సాధారణంగానే ఉంటుంది. పరిస్థితులు సజావుగా ఉంటాయి. అందరికీ సమన్యాయం సమకూ రుతుంది. తాజా కలం: తుకారామ్ ముండే గురించి మీ అభిప్రా యం ఏమిటి? అని ఒక మహా రాష్ట్ర మంత్రివ ర్యుడిని ప్రశ్నించాను. 'అతడొక పిచ్చి వాడు' అని ఆయన ఘాటుగా సమాధా నమి చ్చారు. నిజానికి తమ రాజకీయ యజమా నులకు భయపడకుండా ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధత తో పనిచేసే ముండే లాంటి 'ఉన్మాద' అధికారులు ఇప్పుడు మన దేశానికి చాలా చాలా అవసరం కదూ?!



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# కన్నుల పండుగగా వినాయక నిమజ్జనం

వెలుగోడు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



వెలుగోడు పట్టణం లో వినాయక నిమజ్జనం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గండిపేట విగ్రహం ముందు కదలగ, ఆ విగ్రహం ముందు చెక్క భజన బృందం దేవుని పాటలకు నృత్యం చేస్తూ ముందుకు కదులుతున్నారు. ప్రతి విగ్రహం ముందు యువకులు రంగులు చల్లుకుంటూ, టపాకులు కాలుస్తూ, డ్రమ్స్ మోత మధ్య నృత్యం చేస్తూ, గణపతి పప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఈసారి మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకుంటూ నృత్యం చేయడం విశేషం.పట్టణం లో 43 వినాయక విగ్రహాలు ప్రతిష్టించగా, గండిపేట, సి పి నగర్, ద్వారకానగర్, లక్ష్మి నగర్ లకు చెందిన విగ్రహాలు ముందు కదిలి 4 గంటలకు పొట్టి శ్రీరాములు సెంటర్ కు చేరుకోగా, గ్రామం లోని జమ్మినగర్, తెలుగుపేట , గుర్రం పేట, చాకలి పేట, రాజావీధి, కాపు పేట,పెద్ద దేవలం చెందిన విగ్రహాలు ఎరుకలి పేట, ఎస్సీ కాలనీ, బస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా హైస్కూల్, పాత బస్టాండ్, గ్రామ పంచాయతీ, కాపు పేట, జమ్మినగర్, గాలేరు వాగు మీదుగా రిజర్వాయర్ వద్ద మద్రాస్ కాల్వ లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా ఎస్. ఐ సురేష్, ఆత్మ కూరు డిస్పీ



రామాంజినాయక్, ఆత్మకూరు డివిజన్ రెవిన్యూ అధికారి వెంకట శివ పర్యవేక్షణ లో ముగ్గురు సి. ఐ లు, ఐదు మంది ఎస్. ఐ లు 210 మంది పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. తహసీల్దార్ మంజుల, ఇంచార్జి ఎంపిడిఓ మురారి పాల్గొన్నారు.

# మోదీ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

-మోదీ జన్మదిన వేడుకల్లో అక్కల రామిరెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

పిట్లవారిపాలెం సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పిట్లవారిపాలెం మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అక్కల రామిరెడ్డి నాయకత్వంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పిట్టువారిపాలెంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులకు ప్రోటీన్ ఆహారాన్ని అందించారు. ప్రజలకు సేవ చేయడం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు.అనంతరం మండల కేంద్రంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాల యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఖాజీపాలెంలోనూ మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు అక్కల రామిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు పోషకాహారం అందించారు. సేవా సంకల్పంతో ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో సేవా సంకల్ప ఉత్సవ మండల కన్వీనర్ ఎం. నరసింహమూర్తి రామ రాజు, ఎం. చిన్న సుబ్బారెడ్డి, ఎస్. ఫణీంద్ర శర్మ, యువమోర్చా మండల అధ్యక్షుడు భాను శివప్రసాద్, బాపట్ల జిల్లా ఐటీ కన్వీనర్ కె. సాయినాథ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఏ. శివ సాయిరెడ్డి, మనోహర్, పరిమి సాయిబాబా, చరణ్, నరసింహమూర్తి రాజు తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సృజనాత్మకతకు విశ్వకర్మ ప్రతీక

-కలెక్టర్ సాయి కాంత్ వర్మ

గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

దేవతల శిల్పి, దివ్య వాస్తుశిల్పి, నిర్మాణకర్తగా ప్రసిద్ధి చెందిన విశ్వకర్మ సృజనాత్మకతకు ప్రతీక అని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం కొల్లిపరలో, గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో విశ్వకర్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ విశ్వకర్మ అద్భుతమైన వాస్తు, శిల్పకళ, యంత్ర నిర్మాణ జ్ఞానానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. పురాణాల్లో దేవతలకు నగరాలు, రాజభవనాలు, ఆయుధాలు, రథాలు, అనేక దివ్య నిర్మాణాలను రూపొందించిన మహాశిల్పిగా విశ్వకర్మను వర్ణిస్తారని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో నైపుణ్యం, సృజనాత్మకత, శ్రమకు ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు.విశ్వకర్మను కేవలం భవనాల నిర్మాణకర్తగానే కాకుండా దివ్య ఆయుధాల తయారీదారుగా కూడా పరిగణిస్తారని కలెక్టర్ వివరించారు. వడ్రంగులు, కమ్మరులు, స్వర్ణకారులు, శిల్పులు, యంత్ర నిపుణులు, ఇంజనీరింగ్, తయారీ రంగాలకు చెందిన అనేక వర్గాలు విశ్వకర్మను ఆరాధ్య దైవంగా పూజిస్తారని తెలిపారు. శ్రమకు గౌరవం, వృత్తి నైపుణ్యం, సృజనాత్మకత, సాంకేతిక అభివృద్ధి వంటి విలువలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సృజనాత్మకత, నైపుణ్యం, శ్రమ, సాంకేతిక జ్ఞానం సమాజ అభివృద్ధికి పునాదులు అని కలెక్టర్ సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. భారతీయ శిల్ప, నిర్మాణ, సాంకేతిక సంప్రదాయాలకు విశ్వకర్మ జయంతి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, కార్యాలయ అధికారులు, సిబ్బంది విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, పర్యాటక అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ కేంద్రాలు, వినాయక విగ్రహాల తనిఖీ

పర్చూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్, డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి ఆదేశాల మేరకు మార్టూరు రూరల్ సర్కిల్ సీఐ బి. నాగభూషణం పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సీఐ నాగభూషణం సందర్శించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా విగ్రహాల నిర్వాహకులతో మాట్లాడి కార్యక్రమాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని, కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు, వినాయక విగ్రహాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని సీఐ బి. నాగభూషణం సూచించారు.



## పీఎం విశ్వకర్మ రుణాలు సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

వెలుగోడు మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ రుణాల గురించి సమావే శం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఎం ఎస్ ఎం ఈ అసిస్టెంట్ డైరెక్టర్ డి వీరయ్య గారు మాట్లాడుతూ పిఎం విశ్వకర్మ రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. నంద్యాల జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన లబ్ధిదారులు బ్యాంక్ అధికారుల కు దరఖాస్తులను అందజేశారు. బండి ఆత్మకూర్ యూనియన్ బ్యాంక్ మేజర్ విజయ్ కుమార్ గారు లబ్ధిదారులందరూ రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో రుణాలు చెల్లించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికా రులు, డిపిఎంయు యామిని, జిల్లా పరిశ్రమల ఐపీఓ శివప్రసాద్, డి ఈ ఏ ఫండ్ ఆఫ్ ఆర్బిఐ సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు శంకరయ్య, విజయరాజు, రాజు, శివ నాగరాజు, అబ్దుల్లా, సునీల్ కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



బాపట్ల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణం 3వ వార్డులోని ఇందేటి ప్రసాద్ నివాసంలో ఉంటున్న మెట్టా వెంకటేశ్వర్లు--నాగలక్ష్మి దంపతుల ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన విషయం తెలుసుకున్న బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వేగేశన ఫౌండేషన్ తరఫున ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. అగ్ని ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసి సర్వం కోల్పోయిన కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా తెలుసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ, మాజీ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వర్లు, వార్డు అధ్యక్షుడు యలవల వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాలతో ప్రగతి సాధించాలి

-కలెక్టర్ వినోద్ కుమార్




బాపట్ల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

సృజనాత్మకతను ప్రోత్సహించుకోవడం ద్వారా వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.విశ్వకర్మ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఇన్‌చార్జి డీఆర్ఓ లవన్నతో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ విశ్వకర్మ సృజనాత్మకత, శిల్పకళ, నిర్మాణ నైపుణ్యం, సాంకేతిక ప్రతిభకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. దేశ అభివృద్ధిలో కార్మికులు, శిల్పులు, చేతివృత్తిదారులు, సాంకేతిక నిపుణుల కృషి కీలకమన్నారు. సంప్రదాయ చేతివృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వృత్తిదా రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఓ మల్లిఖార్జునరావు, బీసీ సంక్షేమ అధికారిణి శివలీల, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల జీఎం వై. రామకృష్ణ, ఇతర అధికారులు, బీసీ సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

## పేదల సొంతింటి కల సాకారం

-ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

చిలకలూరిపేట నియోజకవర్గంలో ఇల్లు లేని పేద కుటుంబాలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చిలకలూరిపేట పట్టణంతో పాటు ఎడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన 182 నిరాశ్రయ పేద కుటుంబాలకు గృహ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న కృతనిశ్చయంతో పనిచేస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని పేదల కోసం ఇప్పటికే 5,520 టిడ్కో ఇళ్లను నిర్మించామని తెలిపారు. అందులో 4,510 ఇళ్లను లబ్ధిదారులకు ఇప్పటికే అందజేశామని, వచ్చే నెలలో మరో 1,008 ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం రూ. 2. 50 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణం మరింత సులభతరం చేసేలా కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ నిబంధనలను సరళతరం చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. గృహ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతకు పెద్దపీట



గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

నగర పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్ల ద్వారా పేదలు, దినసరి కూలీలకు రూ. 5కే నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. క్యాంటీన్లలో ఆహార నాణ్యత, రుచి, సరఫరా సమయాలు, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు 22 మంది సిబ్బందిని, సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. భోజన ప్రాంతాలు, తాగునీటి ప్రదేశాలు, వంట పాత్రలను శుభ్రంగా ఉంచడంతో పాటు సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎండలు, అకాల వర్షాల నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్యాంటీన్ల వద్ద షెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదలకు తక్కువ ధరకే ఆహారంతో పాటు పరిశుభ్రమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. క్యాంటీన్లలో లోపాలు కనిపిస్తే జీఎంసీ కాల్ సెంటర్ 0863234 5103కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు.

## పారిశుధ్యంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి

గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



నగరంలో పారిశుధ్య నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైన్ల ఆక్రమణల తొలగింపు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం ఏటీ అగ్రహారం, శాంతినగర్, ఆదర్శనగర్, రైలుపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. డ్రైన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించి, రోజువారీ పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించి, వ్యర్థాలు వేసే వారిపై జరిమానాలు విధించాలని సూచించారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచేలా యజమానులకు నోటీసులు జారీ చేయాలని, దోమల నివారణకు శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో ఫాగింగ్ పెంచాలని ఆదేశించారు. డ్రైన్లను మూసివేసే అక్రమ ర్యాంప్‌లను తొలగించాలని, రైలుపేట డ్రైన్, కల్వర్టు పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పర్యటనలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి ఎమ్మెల్యే కొండయ్య అండ

-ముఖ్యమంత్రి దృష్టికి సమస్య... పేద కుటుంబానికి చేయూత

చీరాల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చేస్తున్న చొరవ అభినందనీయమని ప్రజల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి స్పందిస్తున్న ఎమ్మెల్యే, ఈపురుపాలెం గ్రామానికి చెందిన షేక్ ఆమాన్ భాష కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి భరోసా కల్పించారు. ఈపురుపాలెం గ్రామానికి చెందిన షేక్ కమాన్ భాష కుటుంబం ఆపదలో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, గత ఆగస్టు 7న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు పెన్షన్ మంజూరు చేయించేందుకు కృషి చేశారు. తాజాగా రూ. 4 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం పేద ప్రజల పట్ల ఎమ్మెల్యే చూపుతున్న చొరవకు నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల సమస్యలను దగ్గరుండి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో కృషి చేయడం ప్రజాప్రతినిధిగా ఆయన బాధ్యతా యుతమైన విధానాన్ని ప్రతిబింబిస్తోందని అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని, ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా తన ప్రజాసేవ కొనసాగిస్తానని తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు పెన్షన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్యకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఆయన చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# నేడు మార్టూరులో ప్రత్యేక పీజీఆర్ఎస్

-ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మార్టూరు మండలంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర కళ్యాణ మండపంలో నేడు ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పెషల్ పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలు, భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఒక నెలలో ఒక నియోజకవర్గంలో నాలుగు పర్యటనలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పర్చూరు నియోజకవర్గంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి అన్ని శాఖల మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం కోసం 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని, meekosam. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# మల్లవరంలో తీరని తాగునీటి కష్టాలు

రెంటచింతల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



ఆధునిక సమాజంలోనూ అణగారిన వర్గాల ప్రజలకు కనీస మౌలిక వసతులు అందకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రెంటచింతల మండల పరిధిలోని మల్లవరం గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. గత కొన్ని రోజులుగా కాలనీవాసులకు కనీసం తాగడానికి కూడా నీరు అందకపోవడంతో వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పాడైపోయిన 3 ఫేజ్ మోటారు, ఎండిపోయిన బోర్ల కారణంగా వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీలోని కుళాయిలన్నీ ఎండిపోయి ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. మల్లవరం ఎస్సీ కాలనీలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు గతంలో ప్రభుత్వం వాటర్ ట్యాంకును నిర్మించింది. దీనికి నీటిని సరఫరా చేయడానికి రెండు బోర్లు, ఒక 3 ఫేజ్ హైపవర్ మోటారును ఏర్పాటు చేశారు. అయితే, సరైన నిర్వహణ లేకపోవడంతో మోటారు పూర్తిగా పాడైపోయింది. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రెండు బోర్లు కూడా ఎండిపోయాయి. ఫలితంగా వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారి కాలనీలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తాగునీటి కోసం కాలనీవాసులు సుమారు కిలోమీటరు దూరం నడిచి పక్క పొలాల్లోని వ్యవసాయ బోర్ల వద్దకు, ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం కూలి పనులకు వెళ్లే కార్మికులు సైతం తమ పనులను పక్కనపెట్టి నీటి కోసం వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రతలో దూర ప్రాంతాల నుంచి బరువైన నీటి కుండలు, క్యాన్లు మోసుకు రావడంతో మహిళలు తీవ్ర శారీరక శ్రమకు గురవుతున్నారు. కనీస తాగునీటి కోసం ప్రతిరోజూ ఇంతటి ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మదర్ ఫౌండేషన్ మల్లవరం సంస్థ అధ్యక్షులు జిల్లా బాబురావు ఆధ్వర్యంలో కాలనీవా సులు ఈ నెల 11వ తేదీన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) స్వరూపారాణికి వినతిపత్రం అందజే శారు. కాలనీలో నెలకొన్న దుర్భర పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేవలం ఒక మోటా రు మరమ్మతు చేయించకపోవడం వల్ల వందలాది మంది ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా బాబురావు మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను అధికారులు మానవత్వంతో పరిశీలించాలని కోరారు. తక్షణమే స్పందించి పాడైపోయిన 3 ఫేజ్ మోటారును యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని, లేదా కొత్త మోటారును ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే కాలనీ ప్రజలందరినీ సమీకరించి మండల పరిషత్ కార్యాలయం ముందు ఖాళీ కుండలతో పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్మించిన వాటర్ ట్యాంకు ఉన్నప్పటికీ మోటారు పాడైపోవడం, బోర్లు ఎండిపోవడం వల్ల ప్రజలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాడైన మోటారును బాగు చేయించడంతో పాటు ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని, ఎస్సీ కాలనీ ప్రజల దాహార్తిని తక్షణమే తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవంగా ఉయ్యాల వేడుక చిన్నారిని ఆశీర్వదించిన చీరాల ఎమ్మెల్యే

గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం



గుంటూరులోని కన్వెన్షన్ హాల్‌లో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర కుమార్ మనవరాలి ఉయ్యాల వేడుక, నామకరణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వేడుక సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ తదితర ప్రముఖులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. వేడుకకు విచ్చేసిన ప్రముఖులు నూతన వధూవరులను, చిన్నారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పొన్నూరు, చీరాల ప్రాంతాలకు చెందిన రాజకీయ నేతల ఆప్యాయ పలకరింపులతో కన్వెన్షన్ హాల్ సందడిగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల సమక్షంలో ఉయ్యాల వేడుక ఘనంగా నిర్వహించడంతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# మోదీ జన్మదిన వేడుకల్లో రక్తదాన శిబిరం

రెంటచింతల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రెంటచింతల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ప్రజాసేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. మండల బీజేపీ అధ్యక్షుడు ఇంగుటూరి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరు సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాని జన్మదిన వేడుకల్లో భాగంగా సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి స్థానిక యువత, బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలనే సందేశాన్ని నాయకులు చాటిచెప్పారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరు సాంబశివరావు, మండల అధ్యక్షుడు ఇంగుటూరి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్ఫూర్తిదాయకంగా జరుపుకుంటున్నామని



తెలిపారు. రక్త దానం అత్యంత విలువైన సామాజిక సేవ అని, ఒక్కరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం కల్పిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్య కర్తలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. మోదీ జన్మదిన వేడుకలను ప్రజాసేవతో ముడిపెట్టి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బాధ్యతను చాటిచెప్పారు.

# నిమజ్జన వేళ ప్రమాదకర ప్రయాణాలపై హెచ్చరిక

పర్చూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాలకు వెళ్లే వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లకుండా వాహనదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ట్రాక్టర్లు, గూడ్స్ వాహనాలు, ఇతర వాహనాలపై అధిక సంఖ్యలో ప్రజలను ఎక్కించుకుని ప్రయాణించడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో రహదారి భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలపై పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ప్రమాదకరంగా ప్రయాణించడం వల్ల ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. నిమజ్జనానికి వెళ్లే ప్రజలు



తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాలపై ప్రమాదకరంగా నిలబడి లేదా వేలాడుతూ ప్రయాణించవద్దని పోలీసులు సూచించారు. వాహనదారులు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పర్చూరు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగాలు

గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించడం, శిక్షణ పూర్తిచేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డిసెంబర్ నాటికి సుమారు 9,200 ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. డీడీయూ-జీకేవై 2.0తో పాటు ఇతర పథకాలను సమన్వయం చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 21 భాగస్వామ్య సంస్థల ద్వారా యువతకు వివిధ రంగాల్లో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రణాళికను వివరించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చడం ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత అందుబాటులోకి వచ్చే శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నైపుణ్యాలను



పెంపొందించుకోవడం ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నిరుద్యోగ రహిత గుంటూరు, నిరుద్యోగ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, గళ్లా మాధవి, దేగల ప్రభాకర్, గాదె వెంకటేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

బాపట్ల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణం అర్బర్‌పేటలోని 17వ వార్డు అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవచైతన్య యాప్‌లో నమోదవుతున్న వివరాలను పరిశీలించి, చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై అధికారులను ఆరా తీశారు. నవచైతన్య యాప్ వివరాల పరిశీలనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. కేంద్రంలోని రికార్డులు, యాప్‌లో నమోదు చేస్తున్న సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. వారి యాక్టివిటీలు, విద్యాభ్యాసం తదితర అంశాలను అడిగి తెలుసుకుని, కేంద్రంలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్య సిబ్బందిని ప్రశ్నించి వివరాలు సేకరించారు. పిల్లలకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులు, నవచైతన్య యాప్ వివరాలను



ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, చిన్నారుల ఆరోగ్యం, అభ్యాసం, అభివృద్ధికి సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# మోదీ జన్మదిన వేడుకల్లో ఆశీర్వాద దీపం వెలిగించిన వర్మ

బాపట్ల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ క్షీర భావనారాయణ స్వామి ఆలయం వద్ద 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని దీపాలు వెలిగించి ప్రధానమంత్రి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి, సాధికారత, 'సబ్‌కా సాథ్--సబ్‌కా వికాస్' స్ఫూర్తితో దేశం 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు ముందుకు సాగుతోం దన్నారు. దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని ప్రధానమంత్రికి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. దేశ ప్రజల ఆశీస్సులతో ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాల నారాయణ, జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆండ్రెయ్‌తో పాటు టీడీపీ,




జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏబీసీ పనుల్లో వేగం పెంచాలి

-నగర కమిషనర్ మయూరి అశోక్



గుంటూరు సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చేపడుతున్న యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమంలో రోజువారీ పురోగతి కనిపించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏబీసీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. నగరంలో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి ఏబీసీ కీలకమని, ఇందుకోసం అవసరమైన మౌలిక వసతులతో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. కేంద్రంలో రోజువారీగా ఏబీసీ, ఏఆర్‌వీల సంఖ్య పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని విఏఎస్‌ను ఆదేశించారు. విఏఎస్ కేంద్రంలోనే ఉండి పనులను పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ తదితర మార్గాల ద్వారా దూకుడు స్వభావం కలిగిన కుక్కలపై ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. అదనంగా నిర్మిస్తున్న ఏబీసీ కేంద్రం పనులను ఈ నెలాఖరు లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించడంతో పాటు ఏబీసీ నిర్వహించిన కుక్కలకు మార్గదర్శకాల ప్రకారం ఆహారం, ఆశ్రయం కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, డీఈఈలు సతీష్‌కుమార్, చైతన్య, ఏఈ అబ్దుల్ గౌస్ పాల్గొన్నారు.

## నూతన రహదారితో తీరానికి ఊతం

-అధికారులతో కలిసి పనులను పరిశీలించిన నరేంద్ర వర్మ
-త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశం
-రైతులు, పర్యాటకులకు మెరుగైన రవాణా సౌకర్యం



బాపట్ల సెప్టెంబర్ 17 వార్త సాక్ష్యం

బాపట్ల నుంచి పాండురంగాపురం వరకు రూ.15 కోట్లతో చేపడుతున్న నూతన రహదారి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. బాపట్ల నుంచి పాండురంగాపురం వరకు రూ.15 కోట్ల నిధులతో నూతనంగా అభివృద్ధి చేస్తున్న ప్రధాన రహదారి పనులను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి రహదారి నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నిర్ణయించిన కాలపరిమితిలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన విద్యుత్ స్తంభాలు, ఇతర సాంకేతిక అంశాలు, భూసంబంధిత సమస్యలను సంబంధిత శాఖల అధికా రులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ.. బాపట్ల నుంచి పాండురంగాపురం వరకు నూతన రహదారి అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. తీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులను రైతులు మార్కెట్లకు వేగంగా తరలించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సముద్రతీర ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ రహదారి దోహదప డుతుందని తెలిపారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి, స్థానిక ప్రజల రాకపోకలకు, వ్యవసాయ మరియు ఇతర వాణిజ్య అవసరా లకు ఈ ప్రధాన రహదారి కీలకంగా మారు తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతి నిధులు, ఆర్‌అం డ్‌బీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## రష్యా చమురుపై అమెరికా కొరడా.. భారత్‌లో పెట్రోల్ ధరలకు గండం?



అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కట్టబెట్టే బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. ఈ బిల్లు ఇప్పుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం సిద్ధంగా ఉంది. ఈ పరిణామం రష్యా నుంచి భారీగా ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై తీవ్రమైన దృష్టిని కేంద్రీకరించింది. దీనివల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే దానిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. 2022 నుంచి భారత్‌కు రష్యా అతిపెద్ద చమురు సరఫరా దారుగా మారింది. గణాంకాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో భారత్ సుమారు 40.8 బిలియన్ డాలర్ల విలువైన రష్యా ముడిచమురును దిగుమతి చేసుకుంది. ఇది దేశం మొత్తం చమురు దిగుమతుల్లో 30.3 శాతానికి సమానం. 2026 జులై నాటికి ఈ వాటా ఏకంగా 51 శాతానికి పెరిగింది. దేశీయ అవసరాల కోసం భారత్ 88 శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, రష్యా చమురు ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.అయితే, అమెరికా చట్టం కారణంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆగిపోతే, వెంటనే పెట్రోల్ బంకుల్లో ధరలు పెరుగుతాయని చెప్పలేం. భారత రిఫైనరీలు మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవచ్చు. కానీ, ఇక్కడే ఒక చిక్కు ఉంది. రష్యా నుంచి లభించే రాయితీలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ప్రత్యామ్నాయ చమురుకు ఎక్కువ వెల చెల్లించాల్సి రావచ్చు. అంతేకా కుండా ప్రపంచ మార్కెట్‌లోకి రష్యా చమురు రాక తగ్గితే, మొత్తం సరఫరా తగ్గి అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఇది భారత్‌పై పరోక్షంగా పెను భారాన్ని మోపుతుంది.

## రూ.58,850 నుంచే.. 75 కిలోమీటర్ల మైలేజీ.. తక్కువ ధరలో బెస్ట్ బైక్స్ ఇవే..!



రోజువారీ ప్రయాణాలకు బైక్ కొనాలని చూస్తున్నారా? పెట్రోల్ ఖర్చు తగ్గడంతో పాటు బైక్ ధర కూడా అందుబాటులో ఉండాలంటే 100సీసీ నుంచి 115సీసీ విభాగంలోని కమ్యూటర్ మోడళ్లు మంచి ఆప్షన్‌గా ఉంటాయి. ఈ విభాగంలో రూ.58, 850 నుంచే బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. వాస్తవ వినియోగంలో లీటరుకు 65 నుంచి 75 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇస్తాయని కంపెనీలు పేర్కొంటున్న మోడళ్లు కూడా ఉన్నాయి. ఆ బైక్‌ల వివరాలు ఇవి..టీవీఎస్ రేడియన్.. రూ.58,850 ఈ జాబితాలో తక్కువ ధరతో లభించే బైక్‌ల్లో టీవీఎస్ రేడియన్ ఒకటి. రెట్రో డిజైన్, క్రోమ్ ఫినిష్ హెడ్‌ల్యాంప్, సౌకర్యవంతమైన సీటు దీని ప్రత్యేకతలు. 109.7సీసీ ఇంజిన్ 8.19 పీఎస్ పవర్, 8.7 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. రోజువారీ వినియోగంలో సుమారు 65–70 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.టీవీఎస్ స్పోర్ట్.. రూ.59,100 స్పోర్టీ డిజైన్‌తో కనిపించే టీవీఎస్ స్పోర్ట్‌లో 109.7సీసీ ఇంజిన్ ఉంది. ఇది 8.29 పీఎస్ పవర్, 8.7 ఎన్‌ఎం టార్క్ ఇస్తుంది. ఎలక్ట్రిక్ స్టార్ట్, ఎకానమీ, పవర్ మోడ్ సూచికలు, సింక్రనైజ్డ్ బ్రేకింగ్ టెక్నాలజీ వంటి ఫీచర్లు ఉన్నాయి. వాస్తవ వినియోగంలో 70–75 కిలోమీటర్ల వరకు మైలేజీ వస్తుందని కంపెనీ పేర్కొంటోంది.హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్.. రూ.59,477 97.2సీసీ ఇంజిన్‌తో వచ్చే హెచ్‌ఎఫ్ డీలక్స్ సాధారణ, తక్కువ నిర్వహణ ఖర్చుతో కూడిన కమ్యూటర్ బైక్ గా నిలుస్తుంది. 8.02 పీఎస్ పవర్, 8.05 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఐ3ఎస్ టెక్నాలజీ, అల్లాయ్ వీల్స్, సైడ్‌స్టాండ్ ఇంజిన్ కటాఫ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సుమారు 65–70 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంటున్నారు.హీరో హెచ్‌ఎఫ్ 100.. రూ.59,839హెచ్‌ఎఫ్ 100లో 97.2సీసీ ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్ ఉంటుంది. 8.02 పీఎస్ పవర్, 8.05 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అనలాగ్ మీటర్, కిక్ స్టార్ట్, డ్రమ్ బ్రేక్‌లు, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి. తక్కువ నిర్వహణ ఖర్చుతో రోజువారీ ప్రయాణాలకు ఉపయోగపడేలా దీనిని రూపొందించారు.

## డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై పన్నుల కోత.. కొత్త రేట్లు ఇవే




పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును (స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ ) తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై ఈ పన్నును తగ్గించగా, సవరించిన నూతన రేట్లు సెప్టెంబర్ 16 నుంచే అమల్లోకి వచ్చాయి.తాజా సవరణ ప్రకారం, ఎగుమతి చేసే డీజిల్‌పై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ. 25 నుంచి రూ. 20కి, ఏటీఎఫ్‌పై రూ. 19 నుంచి రూ. 15కి తగ్గించారు. అదేవిధంగా, పెట్రోల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ. 1.50 నుంచి రూ. 0.50కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఈ పన్ను తగ్గింపు కేవలం ఎగుమతులకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనివల్ల దేశీయ రిటైల్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 115.73, డీజిల్ ధర రూ. 103.82 వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య వినియోగదారులకు నేరుగా ఎటువంటి ఉపశమనం లభించదు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ పన్నులను సమీక్షిస్తుంది. తాజా తగ్గింపుతో రిలయన్స్, ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా వంటి చమురు ఉత్పత్తి మరియు ఎగుమతి సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో చమురు కంపెనీలు ఆర్జించిన అదనపు లాభాలను నియంత్రించేందుకు కేంద్రం 2022 జూలైలో తొలిసారిగా ఈ విండ్‌ఫాల్ పన్నును ప్రవేశపెట్టిన సంగతి విదితమే.

## ఢిల్లీలో అభిషేక్ శర్మ తుపాను- 30 బంతుల్లో 100 పరుగులతో సరికొత్త చరిత్ర




మిండియా యువ సంచలనం అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో ఈ యువ బ్యాటర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగంగా శతకం బాదిన భారత ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఆఫ్ఘన్ బౌలర్లపై సిక్సర్ల వర్షం కురిపిస్తూ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అభిమానులకు కనుల పండుగ చేశాడు. సెంచరీ బాదిన తర్వాత ధ్యానముద్రలో కూర్చుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ బౌలింగ్ ఎంచుకోగా, భారత్ ఇన్నింగ్స్‌ను సంజూ శాంసన్‌తో కలిసి అభిషేక్ శర్మ ప్రారంభించాడు. క్రీజులోకి వచ్చాక మొదటి బంతి నుంచే బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న అభిషేక్, ఆఫ్ఘన్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ముఖ్యంగా ఫజల్‌హక్ ఫరూఖీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన ఓవర్లలో సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు.పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 100 పరుగులు చేసిందంటే అభిషేక్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచశ్రేణి బౌలర్ రషీద్ ఖాన్‌ను సైతం వదలకుండా సిక్సర్లు బాదాడు. అబ్దుల్లా అహ్మద్‌జాయ్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో సింగిల్ తీసి, కేవలం 30 బంతుల్లోనే తన మూడో టీ20 సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో, 2017లో శ్రీలంకపై రోహిత్ శర్మ నెలకొల్పిన 35 బంతుల సెంచరీ రికార్డు బద్దలైంది. టెస్టు హోదా ఉన్న దేశాల్లో ఇదే అత్యంత వేగవంతమైన టీ20 సెంచరీ కావడం విశేషం. న్యూజిలాండ్ ఆటగాడు ఫిన్ అలెన్ కోల్‌కతాలో దక్షిణాఫ్రికాపై సాధించిన 33 బంతుల్లో 100 పరుగుల రికార్డు అభిషేక్ దెబ్బకు తెరమరుగైంది. శతకం పూర్తయ్యాక కూడా తన జోరును కొనసాగించిన అభిషేక్ శర్మ.. రషీద్ ఖాన్ బౌలింగ్ లోనే భారీ షాట్‌కు యత్నించి కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే అతను 34 బంతుల్లో 9 ఫోర్లు, 11 భారీ సిక్సర్ల సాయంతో 108 పరుగులు చేసి టీమిండియాను పటిష్ఠ స్థితిలో నిలిపాడు. అతని తుపాను ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది వేసుకుంది.

## ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని- చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా జింబాబ్వేకు చెందిన తవెంగ్వా ముకులాని నియమితులయ్యారు. ఐసీసీ బోర్డు డైరెక్టర్లు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న ఇమ్రాన్ ఖ్వాజా స్థానంలో ముకులానీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ పదవిలో 2027 నవంబర్ వరకు కొనసాగుతారు. ఈ నియామకంతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ పదవిని అలంకరించిన తొలి జింబాబ్వే వ్యక్తిగా ముకులాని చరిత్ర సృష్టించారు.ప్రస్తుతం ముకులాని జింబాబ్వే క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీలో జింబాబ్వే ప్రతినిధిగా ఉండటంతో పాటు, ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ (ఫీడజూ), నామినేషన్స్ కమిటీలలో సభ్యుడిగా, హెచ్‌ఆర్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీకి హెడ్ గానూ పనిచేస్తున్నారు. దక్షిణాఫ్రికా, నమీబియాలతో కలిసి 2027 ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు జింబాబ్వే సహ–ఆతిథ్యం ఇవ్వనున్న తరుణంలో ముకులాని నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ మళ్లీ ఆఫ్రికాకు తిరిగి వస్తున్న వేళ, ఆయన అనుభవం ఐసీసీకి కీలకం కానుంది.ఈ సందర్భంగా ముకులాని మాట్లాడుతూ.. “నాపై నమ్మకం ఉంచిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు కృతజ్ఞతలు. ఐసీసీ ఛైర్మన్ జై షా నాయకత్వంలో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో క్రికెట్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం వంటి ఉత్తేజకరమైన ఈ సమయంలో, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాల కోసం పనిచేస్తాను” అని తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా స్పందిస్తూ.. “డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన తవెంగ్వా ముకులానీకి అభినందనలు. క్రికెట్ పరిపాలనలో ఆయన అనుభవం, ప్రపంచ ఆటపై ఆయనకున్న అవగాహన ఐసీసీ బోర్డుకు అమూల్యమైనవి. ఆయన నియామకం జింబాబ్వేకు ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను బలోపేతం చేయడానికి ఆయనతో కలిసి పనిచేస్తాను” అని పేర్కొన్నారు.

# స్పోర్ట్స్

## ఢిల్లీలో అభిషేక్ శర్మ ఊచకోత బద్దలైన రికార్డులు ఇవిగో!




భారత యువ సంచలనం, స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. గురువారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో రికార్డు పుస్తకాలను తిరగరాశాడు. కేవలం 30 బంతుల్లోనే మెరుపు సెంచరీ సాధించి, భారత క్రీడాభి మానులను ఆనందంలో ముంచెత్తాడు. ఆఫ్ఘన్ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి, ఢిల్లీ ప్రేక్షకులకు పరుగుల విందును అందించాడు. ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న తొమ్మిదేళ్ల రికార్డును బద్దలుకొట్టాడు. 2017లో శ్రీలంకపై రోహిత్ శర్మ 35 బంతుల్లో సెంచరీ సాధించగా, ఇప్పుడు అభిషేక్ కేవలం 30 బంతుల్లోనే ఆ మైలురాయిని దాటి భారత్ తరఫున అత్యంత వేగవంతమైన టీ20 సెంచరీని తన పేరిట లిఖించుకున్నాడు. కేవలం 34 బంతులు ఎదుర్కొని 11 భారీ సిక్సర్లతో 108 పరుగుల వద్ద అభిషేక్ ఔటయ్యాడు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# చిరంజీవికి జోడీగా స్నేహా..?

## 'కాకా'పై భారీ అంచనాలు

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో





పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు. మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే 'కె. సత్యం' అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ 'అమ్ములు పాప'గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు.

## 'ఆయా షేర్' పాటతో లక్ష జడల అమ్మకం నేచరల్ స్టార్ నాని

నేచురల్ స్టార్ నాని తన తదుపరి చిత్రం 'ప్యారడైజ్' ప్రమోషన్‌లలో భాగంగా పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలోని 'ఆయా షేర్' పాట విడుదలైన తర్వాత తన హెయిర్‌స్టైల్‌కు విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఆ పాట చూసిన తర్వాత ఆన్‌లైన్‌లో ఏకంగా లక్షకు పైగా కృత్రిమ జడలు అమ్ముడయ్యాయని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమా కోసం తాను శారీరకంగా ఎంతో శ్రమించానని, సిక్స్ ప్యాక్ సాధించడంతో పాటు జడలతో కూడిన విభిన్నమైన ఆహార్యంలో కనిపిస్తానని వివరించారు. 'ప్యారడైజ్' కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదని, ఇందులో హృదయాన్ని హత్తుకునే బలమైన తల్లి-కొడుకు సెంటిమెంట్ కూడా ఉందని నాని స్పష్టం చేశారు. ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్ బాబు ఒక అద్భుతమైన పాత్రను పోషించారని ఆయన ప్రశంసించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గురించి నాని ప్రస్తావిస్తూ, "దసరా చిత్రం సమయంలో ఉన్న పరిమిత అనుభవంతో కాకుండా, ఈసారి ఈ కథను అత్యంత స్పష్టతతో, పరిపూర్ణంగా తెరకెక్కించారు" అని పేర్కొన్నారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయిక. సెప్టెంబరు 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇప్పటికే ఓవర్సీస్ లో టికెట్ సేల్స్ లో దూసుకుపోతోంది.



## ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి: ఉదయభాను

ఉదయభాను .. 30 ఏళ్ల క్రితమే యాంకర్ గా ఒక టీవీ షోలో గలగలమని మాట్లాడుతూ ఎంతో మంది హృదయాలను దోచుకున్నారు. ఆకర్షణీయమైన రూపంతో ఆకట్టుకునే ఉదయభానుకు అప్పట్లో ఎంతోమంది అభిమానులు ఉండేవారు. ఆ తరువాత ఒక వైపున ఈవెంట్స్ .. మరో వైపున సినిమాలు చేస్తూ ఆమె బిజీ అయ్యారు. రీసెంట్ గా 'పంచనామా' అనే వెబ్ సిరీస్ తో ఆమె నిర్మాతగా మారారు. అలాంటి ఉదయభాను తన గురించిన అనేక విషయాలను 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. "నాకు నా ప్రొఫెషన్ అంటే చాలా ఇష్టం. అందువలన ఆ పనికి సంబంధించిన విషయాలను నేను సమస్యలుగా అనుకోను. నాకు సంబంధించిన వర్క్ విషయంలో నేను ఎప్పుడూ బద్ధకించలేదు .. ఎక్కడా ఆలస్యం చేయలేదు. కానీ నాకు డిసిప్లిన్ లేదనే పుకారు పుట్టించారు. అంతే కాదు ఒక ఈవెంట్ కి గానీ .. ఒక షోకి గాని నేను పెద్ద మొత్తంలో తీసుకుంటానని ప్రచారం చేస్తూ, అవకాశాలు నా వరకూ రాకుండా చేశారు. అలాంటివి విన్నప్పుడు నాకు చాలా బాధ కలుగుతుంది" అని అన్నారు. "నేను ఎప్పుడూ చాలా యాక్టివ్ గా ఉంటాను. కానీ నేను చాలా 'డల్' అయ్యాననే విషయాన్ని నలుగురికి తెలిసేలా చేయడానికి కొంతమంది ప్రయత్నించడం నా ముందే జరిగింది. ఇక్కడ ఎవరో మన గురించి ఒక మాట చెబితే నమ్మేస్తారే తప్ప, నేరుగా మనలను అడగరు .. అసలు విషయమేమిటనేది తెలుసుకోరు. కొన్ని షోస్ విషయంలో నన్ను పక్కన పెట్టినప్పుడు కార్లోనే కూర్చుని ఏడ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఎవరెన్ని చేసినా నేను ఆగలేదు. ఎలాంటి సపోర్టు లేకుండా నిలబడగలిగినందుకు నాకు చాలా గర్వంగా ఉంది" అని అన్నారు.



# మనకు మనమే శత్రువులం

## అవును, 100 శాతం వాస్తవం: శోభిత ధూళిపాళ

సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగు పెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలు తాను కెరీర్ ప్రారంభించిన నాటి పరిస్థితులకు సంబంధించినవని, ఇప్పుడు పరిస్థితులు మారి ఉంటాయని ఆశిస్తున్నట్లు శోభిత స్పష్టం చేశారు. సమాజంలో ఒకరికొకరు మద్దతు గా నిలవాలని, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు అవసరమైన మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. 'గూఢచారి', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన శోభిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.